ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 1 జూన్ 2025 | 5





మా బాబే.. మాతో నడుస్తున్నాడు : చెయ్యేరులో ఉపాధి హామీ మహిళా శ్రామికులతో కలిసి చెరువును పరిశీలించి వస్తున్న సీఎం చంద్రబాబు



పెన్షన్..నో టెన్షన్ : ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడి అక్కడే పింఛను అందజేస్తున్న సీఎం చంద్రబాబు



మీ సేవకు హ్యాట్సాప్ : బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న మంతెన రామరాజును సన్మానిస్తున్న సీఎం



మీ మనసు బంగారం : బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న త్సవటపల్లి నాగేంద్రరావుకు సన్మానం



మీ వెంటే నడుస్తాం : చెయ్యేరులో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ సానా సతీష్, మహాసేన రాజేష్ తదితర టీడీపీ నాయకులు

మీరు చెప్పినట్టే అధిష్ఠానం నడుస్తుంది..

నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు దిశానిర్దేశం

ముమ్మిడివరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కార్యకర్తలే ముఖ్యం. మీ అభిప్రాయాల మేరకే పార్టీ అధిష్ఠానం నడుచుకుంటుంది. అనునిత్యం ప్రజలతో మమేకమై ఓటుబ్యాంకు పెంచే దిశగా పనిచేయాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ముమ్మిడివరం మండలం సీహెచ్.గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జరిగిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రోజు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలు పెట్టాం. రాబోయే ఎన్నికల్లో గతంలో ఓడిన 11 అసెంబ్లీ స్థానాలు మనమే గెలవాలి. టెక్నాలజీని పెంచుకుని సేవలు విసరిస్తున్నాం. ప్రజలతో కార్యకర్తలు మమేకమై మరింత పేరు తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గం టీడీపీ కంచుకోట. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో మహిళల ప్రాధాన్యత పెంచాల్సి ఉందన్నారు. 25 మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ల నియామకానికి సంబంధించి సర్వే నిర్వహించగా కొంతమందికి 90 శాతం, కొంతమందికి 50 శాతం రిపోర్టు వచ్చిందన్నారు. ఎస్సీ ఓటు బ్యాంకు పెంచేందుకు పీ4 అమలు చేస్తున్నాం అంటూ చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పనితీరుపై చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా పోస్టింగుల్లో వెనుకబడి ఉన్నారంటూ చురక వేశారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ముమ్మిడివరం నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుల పనితీరు విశ్లేషించారు. బెస్ట్ అవార్డులు తీసుకున్న క్లస్టర్ ఇన్‌చార్జి గొలకోటి దొరబాబు, యూనిట్ ఇన్‌చార్జి దూలిపూడి వెంకటసుబ్బారావు, బూత్ ఇన్‌చార్జిల దంగేటి వీరప్రసాద్‌లను అభినందించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి, రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల చొప్పున పరిహారం

ఇటీవల గోదావరిలో గల్లంతై మృత్యువాత పడ్డ బాలుర కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించి వెంటనే అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అవగాహన లేకుండా సరదాల కోసం స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం



ఏంటమ్మా.. సమస్య

చెయ్యేరు.. జనం మురిసేరు!



చెరువు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

చంద్రబాబుకు నీరాజనం

- 2 గ్రామాల్లో 6 గంటల పర్యటన
- సమస్యలు విని.. పరిష్కారం
- జూన్ 12 తర్వాత గేర్ మారుస్తా
- ఆకట్టుకున్న చంద్రబాబు ప్రసంగం

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎంతో సమస్యలు చెప్పుకున్నారు..వెంటనే పరిష్కారం చూపారు.. హామీలు ఇచ్చారు..జనం మురిసేరు..మా బాబే అంటూ జేజేలు పలికారు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల పరిధిలోని రెండు గ్రామాల్లో శనివారం ఆరు గంటలపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ప్రజావేదిక నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం పురికొల్పారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో మరో సమావేశం నిర్వహించి కేడర్‌కు నేనున్నాను అనే భరోసాను కల్పించారు. నేనున్నంత వరకు టీడీపీకి ఓటమి ఉండదంటూ కేడర్ హర్షధ్వానాల మధ్య చంద్రబాబు ప్రకటించారు. సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్‌కు శనివారం 12 గంటలకు చేరుకున్న చంద్రబాబుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాట్రేనికోన మండలం చెయ్యేరులో చెరువు పూడికతీత పనుల్లో నిమగ్నమైన ఉపాధి శ్రామికులతో చెరువు గట్టున నడుస్తూ ముచ్చటించారు. ప్రజావేదిక సభలో చలోక్తులు, చురకలు, వార్నింగ్‌లు, హెచ్చరికలు చేస్తూ చేసిన ప్రసంగం అందరినీ ఉర్రూతలూగించింది.ఈ నెల 12వ తేదీ నాటికి ఏడాది పాలన పూర్తి కావడంతో పాలనా పరంగా గేర్ మారుస్తానంటూ సంకేతాలు పంపారు. చెయ్యేరులోని ప్రజావేదిక సభకు చేరుకుని రెండు బంగారు కుటుంబాలను దాతలకు దత్తత ఇచ్చారు. అదే వేదికపై సుమారు గంటా 45 నిమిషాల పాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. ప్రజావేదికలో నివేదికలను తప్పుడు తడకలుగా ఇవ్వడంతో అధికారులను మందలించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 10వేల ఇళ్లకు సోలార్ పవర్ కల్పించకపోతే 'ఎమ్మెల్యే పవర్ కట్ అవుతుందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు వెల్లివిరిశా యి. అవినీతి అధికారులకు ఘాటైన హెచ్చరికలు చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తానన్నారు. ఇటీవల ఒక పాస్టర్ మరణాన్ని కొందరు స్వార్థపరులు హత్యగా విష ప్రచారం చేశారన్నారు. బంగారు కుటుంబాలకు భవిష్యత్తుకు భరోసా ఇస్తూ దాతలకు బాధ్యతలు అప్పగించారు. సాయంత్రం 5.45 గంటలకు సీహెచ్.గున్నేపల్లి నుంచి హెలికాప్టర్‌పై ఉండవల్లిలోని నివాస గృహానికి బయలుదేరి వెళ్లారు.



ఉపాధి శ్రామికులతో 15 నిమిషాలు..

నాయకుడంటే ఎలా ఉండాలి.. ప్రజలతో మమేకం కావాలి.. వారి సమస్యలు తెలుసుకోవాలి.. వాటి పరిష్కారానికి మార్గాలు వెతకాలి.. చెయ్యేరు గ్రామంలో ఇటువంటి ఆసక్తికరమైన సంఘటనే చోటుచేసుకుంది. ఆ గ్రామంలో రూ.9.86 లక్షలతో చేపట్టనున్న చెరువు పూడికతీత పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. నరేగా పథకం కింద అక్కడ పనిచేస్తున్న ఉపాధి హామీ మహిళా శ్రామికులతో ముచ్చటించారు. వారితో కలిసి చెరువు గట్టున తిరుగుతూ ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల పథకంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ పంపిణీలో లోటుపాట్లు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. గ్రామంలో ఉన్న టీడీపీ నాయకుల పనితీరు.. ఉపాధి కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ చెరువులో పూడికతీత పనులు ఎంతకాలం ఉంటాయని ఉపాధి కూలీలను అడగ్గా, రెండు నెలల పాటు ఉంటాయని సమాధానమిచ్చారు. సుమారు పదిహేను నిమిషాల పాటు వారితో గడిపి పథకాల అమలుపై సమాధానాలు రాబట్టి సంతృప్తిని వ్యక్తంచేశారు.



ప్రజా వేదికపై చంద్రబాబు పక్కన నిలబడి సమస్య విన్నవిస్తున్న మహిళ.. చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, సుభాష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు తదితరులు

అడిగింది లేదనకుండా.. అన్నీ ఓకే..!

చెయ్యేరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి హామీల వర్షం కురిపించారు. వృద్ధ గౌతమీ నదీపాయపై పల్లంకుర్రు- జి.మూలపాలెం మధ్య అసంపూర్తిగా ఉన్న వారధి నిర్మాణాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ముమ్మిడివరం- కాట్రేనికోన వంతెన, గోగులంక బ్రిడ్జి, కుండలేశ్వరం బ్లడ్‌బ్యాంక్ ఆధునీకరణ, చెయ్యేరులో చెరువును సీపీడబ్ల్యూ పథ కంలో మంజూరు చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు కోరారు. వీటికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను చంద్రబాబు వెంటనే ఆదేశించారు. చెయ్యేరు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని కోరారు.వీటికి యాక్షన్‌ప్లాన్ తయారుచేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ కావాలని కోరడంతో మం జూరు చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆగస్టు నాటికి బంగారు కుటుంబాల సర్వే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



మీ వెంటే ఉంటాం సార్ : ప్రజావేదిక సభలో ఒక మహిళ అభివాదం

సీఎంతో చిన్నారుల.. చిరు కోరిక!

అమలాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : నాడు సీఎం అంటే ప్రజలకు దూరం..దూరం.. నేడు సీఎం చిన్నారులకూ దగ్గరే.. చెయ్యేరు ప్రజావేదిక వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు చిన్నారులు ముఖ్యమంత్రితో మాట్లాడడానికి ప్రయత్నించారు.. అది గమనించిన సీఎం దగ్గరకు పిలిచి ఏం కావాలమ్మా అని అడిగారు.. అంతే చిన్నారుల్లో పట్టలేని ఆనందం.. అడిగిందే తడవుగా క్రికెట్ ఆడుకోవడానికి క్రికెట్ కిట్ కావాలి సార్ అంటూ కోరారు. అడిగిందే తడవుగా వెంటనే కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను పిలిచి వెంటనే చిన్నారులకు క్రికెట్ కిట్ అందించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చెయ్యేరు గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్ ద్వారా చిన్నారులకు క్రికెట్ కిట్ అందజేశారు. కిట్ అందుకున్న చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు.



ఏం కావాలో.. చెప్పండి : గ్రామంలోని పిల్లలతో ముచ్చటించి ఫొటో దిగిన దృశ్యం

క్రికెట్ కిట్ అందజేసిన దృశ్యం





నేనున్నా.. చెప్పండి : దివ్యాంగురాలి సమస్య విని అక్కడికక్కడే పెన్షన్ మంజూరు చేయించిన సీఎం

పేదలకు అండగా ప్రభుత్వం

మంత్రి కందుల దుర్గేష్



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పింఛన్లు అందిస్తూ పేదలకు అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.పట్టణంలోని 4,8 వార్డుల్లో శనివారం మంత్రి దుర్గేష్ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేసి మాట్లాడారు. జూన్ 1వ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం అందరికి ఆదర్శంగా నిలిచిందన్నారు.గత ప్రభుత్వంలో చాలీచాలని పింఛన్లు అం దిస్తే ఈ ప్రభుత్వం అం దరికి భరోసా కలిగేలా పింఛను సొమ్ము పెంచి అందిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఖజా నా ఖాళీ చేసి వెళ్లడంతో ఆర్థిక సంక్షోభంలో ఉన్నా సీఎం చంద్రబాబు నాయుడు దేనిని లెక్కచేయకుండా పేదల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తుందన్నారు. త్వరలోనే పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం పథకంతో పాటు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేస్తామన్నారు.కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, పలువురు అధి కారులు పాల్గొన్నారు.

ఒక్క రోజు.. 93.61 శాతం

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో జిల్లాలో ఈ నెల కూడా అదే జోరు కొనసాగింది. ఉదయం 9.30 గంటలకే 75% పంపిణీ నమోదైంది.జిల్లాలో మొత్తం 2,33,924 మంది లబ్ధిదారులు ఉండగా సాయంత్రానికి 2,18,966 మందికి రూ.95,25,50,500 అందజేశారు. దీంతో 93.61 శాతంతో రాష్ట్రంలో జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. ఈసారి మొదటి మూడు స్థానాల్లో కోరుకొండ(94.92), రాజమండ్రి అర్బన్(94.63),గోపాలపురం(94.44) ఉండగా..చివరి స్థానంలో కొవ్వూరు అర్బన్ (91.72) ఉంది.ఉదయం నుంచే కూటమి నాయకులు,అధికారులు,సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. సాధారణంగా ఒకటో తేదీన పింఛను అందజేస్తారు.ఒకటో తేదీ ఆదివారం కావ డంతో ఒక రోజు ముందుగా శని వారమే పింఛను ఇవ్వడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది.

నేటి నుంచి దుకాణాల్లోనే రేషన్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రేషన్ దుకాణాల పర్వం మళ్లీ మొద లైంది. జిల్లాలో ఆదివారం నుంచి పేదలకు ఇచ్చే బియ్యం,పంచదార, కందిపప్పు వంటి సరుకుల పంపిణీ రేషన్ షాపుల్లో జరగనుంది. గత వైసీపీ పెట్టిన ఎండీయూ వాహనాల విధానం లోపభూయిష్టంగా ఉందనే కార ణంతో టీడీపీ కూటమి ప్రభు త్వం పాత విధానాన్ని మళ్లీ అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ విధానాన్ని ఆదివారం ఆయా నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. జిల్లాలో 871 చౌక ధరల డిపోలు ఉండగా 5 లక్షల 64 వేల 994 రేషన్ కార్డులు ఉన్నాయి. ఆయా డిపోల్లో బియ్యం, పంచదార అందరికీ ఇవ్వనున్నారు.ఈ సారి కందిపప్పు కొంత మందికే అందనుంది. రేషన్ దుకాణాలు ప్రతి నెల 15వ తేదీ వరకూ ప్రతి రోజూ, ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా డీలర్లు సరుకును సిద్ధం చేసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రేషన్ సక్రమంగా అందజేస్తామని జిల్లా వ్యాప్తంగా డీలర్లు తెలిపారు.



పువ్వులతో రేషన్ దుకాణం ముస్తాబు

12 నుంచి పాఠశాలల్లో యోగాంధ్ర

రాజమహేంద్రవరం సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పాఠశాలలో ఈనెల 12 నుంచి 20 తేదీ వరకు తప్పనిసరిగా యోగా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి శనివారం జేసీ, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ ఎస్.చిన్నరాముడు,ఇతర అధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాపై ప్రతి మండలంలో పోటీలు నిర్వహించాలన్నారు. మెడిటేషన్, సూర్యనమస్కారాలు, యోగాలో ఆసనాలు వివిధ కేటగిరిలుగా విభజించి పోటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఐదు సెంటర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుని ప్రజలతో యోగా చేయించాలన్నారు. జూన్ 8న సీనియర్ సిటిజన్స్‌తో జిల్లా ,డివిజన్ ,మండల కేంద్రాల్లో కార్యాచరణ రూపొందించాలన్నారు.

తుఫాన్ ప్రమాదం : కలెక్టర్

తుఫాన్ వచ్చే ప్రమాదం ఉన్నందున జిల్లా, మండల అధికారులు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. భారీ వర్షాల కారణంగా నీరు నిల్వలేకుండా డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చూసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి,సీపీవో జేడీఎల్ అప్పల కొండ, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ . మూర్తి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేఎన్.జ్యోతి ,డీఈవో కె వాసుదేవరావు పాల్గొన్నారు.



నిఘా పెంచండి : ఎస్పీ

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఉంచడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. నేర సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచాలన్నారు. దీర్ఘకాలంగా దర్యాప్తులు కొనసాగుతున్న కేసుల విషయంలో పలు సూచనలు చేశారు. మిస్సింగ్, ఫోక్సో, ఎస్సీఎస్టీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ బలోపేతం చేయాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక, నేర పూరిత స్వభావం కలిగిన వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌జి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీఎస్‌వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

ఇన్‌చార్జి డీఎస్‌వోగా రాజా రమేష్

రాజమహేంద్రవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పౌర సరఫరాల అధికారి(డీఎస్‌వో)గా రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. ప్రస్తుతం ఆయన గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్నారు. డీఎస్‌వో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. ఈ మేరకు శనివారం సాయంత్రం బొమ్మూరులో ఒక రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు.

బాల కార్మికుల గుర్తింపునకు నెలాఖరు వరకూ ప్రత్యేక డ్రైవ్

రాజమహేంద్రవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికుల గుర్తింపునకు జూన్ 30వ తేదీ వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని డీఆర్‌వో టి.సీతారామ మూర్తి పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాల కార్మికుల కేసులు ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 17 నమోదు చేసి రూ.96118 పరిహారంగా ఇప్పించామన్నారు. వివిధ శాఖల సమన్వయంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ పని చేస్తోందని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమస్కరించి స్వాగతం పలుకుతున్న మంత్రి సుభాష్

ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే చినరాజప్ప, రెడ్డి సుబ్రహ్మణ్యం



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కోనసీమ ఎస్పీ కృష్ణారావు, జేసీ నిషాంతి



ఎమ్మెల్యే సుబ్బరాజును పలకరిస్తున్న సీఎం

ముమ్మిడివరం, మే 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామంలో ఘనస్వాగతం లభించింది. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో శనివారం 12.21 గంటలకు సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సీఎం పర్యటన ప్రోగ్రాం కన్వీనర్ పెందుర్తి వెంకటేష్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చిల్లా జగదీశ్వరి, మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, రాజ్యసభ సాన సతీష్, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ శాసనమండలి సభ్యుడు చిక్కాల రామచంద్రరావు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నాయకులు మోకా ఆనంద్‌సాగర్, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, చెల్లి అశోక్, టేకుమూడి లక్ష్మణరావు, తాడి నరసింహారావు, సాగి సూరిబాబురాజు, మోకా బాలప్రసాద్, కర్రా దుర్గాప్రసాద్, అత్తిలి బాబూరావు, దూడల స్వామినాయుడులతోపాటు పలువురు ఘనస్వాగతం పలికారు. తొలుత కార్యకర్తే అధినాయకుడు కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాలు), స్థానిక సర్పంచ్ గొలకోటి దొరబాబులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అడబాల సతీష్‌కుమార్, అర్ధాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, దాట్ల బాబు, బోనం కృష్ణ, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, యాళ్ల ఉదయ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు 12.35 గంటలకు హెలిప్యాడ్ నుంచి ప్రత్యేక వాహనంలో కాట్రేనికోన మండలం చెయ్యేరులో నిర్వహించే ప్రజాసేవ కార్యక్రమానికి హాజరయ్యారు.

చెయ్యేరు మంచినీటి ప్రాజెక్టుకు నిధులివ్వండి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే దాట్ల వినతి



సమీక్షలో మాట్లాడుతున్న దాట్ల

ఐ.పోలవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజావేదికలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు ముమ్మిడివరం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు చేపట్టబోయే పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సుమారు పది నిమిషాలసేపు చంద్రబాబు ముందు సమస్యలను ఏకరువు పెట్టారు. వాటికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులో జరిగిన పేదల సేవలో పీ4 కార్యక్రమాన్ని ముమ్మిడివరం నియోజకవర్గంలో నిర్వహించినందుకు చంద్రబాబుకు ఆయన తొలుత కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 42 వేలమందికి రూ.270 కోట్లు పింఛన్లు అందించడం జరుగుతోందన్నారు. పేదలకు అన్న క్యాంటీన్ల ద్వారా మంచిభోజనం అందిస్తున్నామన్నారు. రహదారులను అభి వృద్ధి చేయడంతోపాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. అయితే చెయ్యేరు గ్రామంలో తాగునీటిని బోరు ద్వారా అందించేవారమని, ఇటీవల చెరువుల వల్ల తాగునీటి కలుషితమైందన్నారు. ప్రస్తుతం చెరువును గత టీడీపీ హయాంలోనే రూ.18 కోట్లు మంజూరు చేసి తాగునీరు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మంచినీటి పథకానికి నిధులు మంజూరుచేసి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని కోరారు. గ్రామానికి సీసీ రోడ్లు, డ్రైనేజీలు పెండింగ్ పనుల జాబితా అందిస్తానని, వీటికి నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే కోరారు. ఎస్.మూలపాలెం వంతెనకు, ముమ్మిడివరం- కాట్రేనికోన వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామ కార్యదర్శి నివేదికను అందిస్తూ చెయ్యేరు గ్రామ జనాభా 7915 మంది, 2192 కుటుంబాలు ఉండగా, ఎన్టీఆర్ భరోసా కింద 1087 మందికి పింఛన్లు అందిస్తున్నామని, గ్రామంలో 141 బంగారు కుటుంబాలను గుర్తించగా, 9 మంది బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్టు తెలియజేశారు.

2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ : కోనసీమ కలెక్టర్



ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజావేదికను ఉద్దేశించి తొలుత జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్వాగత ఉపన్యాసం చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు దార్శనికతతో రూపొందించిన 10 సూత్రాల విజన్ డాక్యుమెంట్లలో పేదరిక నిర్మూలనకు ప్రధాన స్థానం కల్పించారన్నారు. తొలుత సభాస్థలికి సుమారు 1.55 గంటలకు ప్రజావేదిక వద్దకు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. ప్రజావేదిక వద్ద ఉన్న దివ్యాంగులతో చంద్రబాబు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను విన్న చంద్రబాబు పక్కనే ఉన్న జిల్లా కలెక్టర్‌ను వినతులను పరిష్కరించాలని ఆదేశించారు.

ఐపీఎల్ మ్యాచ్‌ల వీక్షణకు తొలిసారిగా

కాకినాడలో ప్రత్యేక స్క్రీన్లు

బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ గైక్వాడ్, ఎంపీ సతీష్ కార్యాలయ ఇన్‌చార్జ్ లక్ష్మణమూర్తి



మీడియా సమావేశంలో పాల్గొన్న గైక్వాడ్, లక్ష్మణమూర్తి

కాకినాడ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ మ్యాచ్‌ల వీక్షణకు క్రికెట్ ప్రేక్షకుల కోసం కాకినాడలో తొలిసారిగా ప్రత్యేక స్క్రీన్లతో ఏర్పాట్లు చేసినట్లు బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ అల్విన్ గైక్వాడ్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి వెల్లడించారు. జూన్ 1,3 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి జరిగే సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు సంబంధించి స్క్రీన్లపై వీక్షించే ప్రేక్షకుల నిమిత్తం కాకినాడ కాస్మో పాలిటిన్ క్లబ్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. గైక్వాడ్, లక్ష్మణమూర్తి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఐపీఎల్ క్వాలిఫై, ఫైనల్ మ్యాచ్‌ల వీక్షణ కోసం కాకినాడలోని స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో 10 వేలమంది వీక్షించేలా పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశామన్నారు. 1న పంజాబ్, ముంబై జట్ల మధ్య జరిగే క్వాలిఫై మ్యాచ్‌తో పాటు 3న జరిగే ఫైనల్ మ్యాచ్ వీక్షించేలా ఏర్పాట్లు జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్ మ్యాచ్‌లు ఎంతో ప్రాచుర్యం పొందాయని, అందులో భాగంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో క్రికెట్ ప్రేక్షకులకు కాకినాడలో పెద్ద స్క్రీన్లపై వీక్షించే అవకాశం కలిగిందన్నారు. క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఆయన కాకినాడలో స్టేడియం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాగే ప్రతిభగల యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తు న్నారన్నారు. అనంతరం ఐపీఎల్ ఫాన్ పార్క్ టీ షర్టులను ఆవిష్కరించారు.

శుభ కార్యానికి వెళ్తుండగా...

భార్య కళ్లెదుటే భర్త మృతి

- భార్యకు గాయాలు
- మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ



ప్రమాదంలో మృతిచెందిన సత్యభాస్కరరావు, గాయపడిన భార్యకు సాయం చేస్తున్న ప్రయాణికులు



సత్యభాస్కరరావు (ఫైల్)

రాజానగరం, మే 31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లారీ ఢీకొని భర్త అక్కడికక్కడే మృతిచెందగా, భార్యకు గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన బిక్కిన సత్యభాస్కరరావు (69), భార్య పాపాయమ్మ శనివారం మోటార్ సైకిల్‌పై పెద్దాపురం మండలం కట్టమూరులో జరిగే శుభ కార్యానికి బయలుదేరారు. మార్గమధ్యంలో రాజానగరం- కలవచర్ల జంక్షన్‌లోకి వచ్చేసరికి ఏడీబీ రోడ్డు వైపునకు మలుపు తిరుగుతుండగా విజయవాడ నుంచి ప్లాస్టిక్ పైపుల లోడుతో వైజాగ్ వెళ్తున్న లారీ ఢీకొనడంతో అదుపుతప్పి ఇద్దరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో భాస్కరరావు తలకు వెనుక వైపు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య పాపాయమ్మకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మృతుడి కుమారుడు విదేశాల్లో ఉంటున్నాడు. ఈ మేరకు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ పర్యవేక్షణలో ఎస్.ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్

చీఫ్ ఇంజనీర్‌గా చిన్న కామేశ్వరరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కామేశ్వరరావు

మోతుగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి) మోతుగూడెం లోయర్ సీలేరు ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ స్వామి నాయుడు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తోన్న సీడీ చిన్న కామేశ్వరరావు ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. కామేశ్వరరావుకు డీఈటీ వరప్రసాద్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంటు ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, పలువురు యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు.

డెల్టా కాలువలకు నేడు నీరు విడుదల

ధవళేశ్వరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రబీ అనంతరం మూసివేసిన డెల్టా కాలువలకు ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయనున్నారు. నిర్ణయించిన ముహూర్తం మేరకు గోదావరి మాతకు పూజలు చేసి ఆయా డెల్టా కాలువల పరిధిలో హెడ్ స్లూయిజ్ గేట్లను ఎత్తి అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. కాల్వలకు నీటి విడుదల చేయనున్న నేపథ్యంలో సిబ్బంది హెడ్ స్లూయిజ్‌ల వద్ద మామిడి తోరణాలు కట్టి సిద్ధం చేస్తున్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు

ద్రాక్షారామ, మే 31 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అన్నాయిపేట గ్రామానికి చెందిన కొప్పిశెట్టి నారాయణ రావు(45) మృతిపై ద్రాక్షారామ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణరావు, పెంకె ప్రసాద్ స్నేహితులు. శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో నారాయణరావును ప్రసాద్ బయట నుంచి తీసుకొచ్చి ఇంటి వద్ద దింపి వెళ్లాడు. తిరిగి ప్రసాద్ మళ్లీ ఫోన్ చేయడంతో మళ్లీ బయటకు వెళ్లారు. అర్ధరాత్రి 12 దాటిన తన భర్త ఇంటికి రాకపోవడంతో నారాయణరావు భార్య సంధ్యారాణి ప్రసాద్‌కు ఫోన్ చేయగా నారాయణరావు కుప్పకూలిపోవడంతో ఆసుపత్రికి తరలించినట్లు ప్రసాద్ తెలిపాడు. దీంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో సంధ్యారాణి తన భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ పేర్కొన్నారు.

ట్రాక్టర్ చక్రాల కింద పడి వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన పైడారావు

బిక్కవోలు, మే 31 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో శనివారం సాయంత్రం ట్రాక్టర్ కింద పడి రెడ్డి పైడారావు(57) మృతిచెందాడు. ఎస్ఐ వి.రవిచంద్ర కుమార్ వివరాల ప్రకారం.. పందలపాకకు చెందిన రెడ్డి పైడారావు కొమరిపాలెంలోని ఒక రైసుమిల్లులో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం పని ముగించుకుని వస్తుండగా తొస్సిపూడి వంతెన అదే గ్రామానికి చెందిన గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి లిఫ్ట్ అడగగా అతడిని ఎక్కించుకుని వస్తూ పందలపాక కోదండరామా రైసు మిల్లు వద్ద ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా కుడి వైపుకు తిరగడంతో ఇద్దరు వెనుక చక్రం కింద పడిపోయారు. తీవ్రగాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పైడారావు మృతిచెందగా శ్రీనివాసరెడ్డి చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

విద్యుత్ షాక్‌తో దింపు కార్మికుడి మృతి



కొబ్బరిచెట్టుకు రాజ్‌కుమార్ మృతదేహం

అంతర్వేది, మే 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వీవీమెరక గ్రామం ప్రగతి నగర్‌లో దింపు కార్మికుడు బూసి రాజ్‌కుమార్ (నాని) (29) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ శనివారం ఉదయం 11 గంటలకు కొబ్బరిచెట్టు ఎక్కి దింపు తీస్తుండగా కొబ్బరి ఆకు 11కేవీ వైరుకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కొబ్బరిచెట్టుకు వేలాడుతూ మృత్యువాత పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని రైతు మృతి



నారాయణమూర్తి (ఫైల్‌ఫొటో)

ఆలమూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందాడు. మూలస్థాన అగ్రహారానికి చెందిన తోరాటి నారాయణమూర్తి (44) అనే రైతు ఉదయం తన పొలం పనులు ముగించుకుని తన గ్రామం పక్కనే ఉన్న జొన్నాడకు సైకిల్ వెళ్లి పశువుల దాణా తీసుకుని వస్తుండగా మూలస్థానం వచ్చేసరికి రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రా వెల్స్ బస్సు వస్తువులు భద్రపరిచే డోర్ తెరచి ఉండటంతో సైకిల్‌పై వస్తున్న నారాయణమూర్తిని ఢీకొంది. దీంతో బలంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందినట్టు ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి



పాంగి రమేష్ (ఫైల్‌ఫొటో)

మోతుగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతరామరాజు జిల్లా వై.రామవరం మండలం డొంకరాయి గ్రామానికి పాంగి రమేష్ పాము కాటుకు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా రమేష్‌ను పాము కాటు వేసింది. డొంకరాయి జెన్కో ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శనివా రం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదుపై డొంకరాయి ఎస్ఐ శివకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుడికి వేడుకగా పల్లకీసేవ



ఆలయం లోపల పల్లకీసేవ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి శనివారం పల్లకీసేవ వేడుకగా జరిగింది. ప్రతీ శనివారం ప్రాకార సేవ నిర్వహిస్తుండగా ఆ సమయంలో వాతావరణం సరిగా లేకపోవడంతో అర్చకులు పల్లకీ సేవ నిర్వహించారు. ప్రధానాలయ గోపురాల నడుమ ముమ్మారు స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఉంచి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణతో వేడుకగా జరిగింది.

ఐఏఎస్ కృష్ణతేజ ప్రత్యేక పూజలు

సత్యదేవుడి సన్నిధిలో శనివారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యక్తిగత కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కృష్ణతేజ కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు

డిపోల ద్వారా

రేషన్ పంపిణీకి నేడు శ్రీకారం

పిఠాపురంలో ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల

పిఠాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీని కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నారు. స్థానిక నూకాలమ్మ గుడి వద్దనున్న దుకాణంలో సరుకులను కార్డుదారులకు అందిస్తారు. అంతకు ముందు పాదగయ క్షేత్రంలో దివీస్ ల్యాబ్స్ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ఆర్వో వాటర్ ప్లాంట్లు (కుక్కుటేశ్వర జలప్రసాదం)ను ప్రారంభించి, సకలేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని జనసేన వర్గాలు తెలిపాయి.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం


పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం జరగనున్నది. చైర్మన్‌గా వాకపల్లి దేవి సూర్యప్రకాష్, వైస్‌చైర్మన్‌గా గాది రాజబాబు, ఇతర డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల పాల్గొంటారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

5న ఏపీ ఎడ్‌సెట్-2025

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 12 పరీక్షా కేంద్రాలు

ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారావు



సుబ్బారావు

దివాన్‌చెరువు, మే31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 5న రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఏపీఎడ్‌సెట్-2025 పరీక్ష ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 12 కేంద్రాల్లో జరుగుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల ప్రిన్సిపాల్, ఏపీఎడ్‌సెట్-2025 ప్రాంతీయ సమన్వయకర్త కొండ్రు సుబ్బారావు తెలిపారు. ఈ పరీక్షకు తనను ప్రాంతీయ సమన్వయకర్తగా ఎడ్‌సెట్ కన్వీనర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారని శనివారం తెలిపారు. ఎడ్‌సెట్ పరీక్షకు దాదాపు 2500 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం అవుతుందని, విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ పరీక్షకు పరిశీలకులుగా ఉభయ గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల నుంచి సీనియర్ ప్రొఫెసర్‌లను నియమించామన్నారు. కాగా ఏపీఎడ్‌సెట్‌కు ప్రాంతీయ కోఆర్డినేటర్‌గా నియమితులైన సుబ్బారావును వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ అభినందించి పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

స్త్రీ శక్తికి ప్రతిరూపం అహల్యాబాయి

చత్తీస్‌ఘడ్ డిప్యూటీ సీఎం అరుణ్ సావ్



అరుణ్ సావ్‌ను సత్కరిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న అరుణ్ సావ్

రాజమహేంద్రవరం అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తికి ప్రతిరూపం రాణి అహల్యాబాయి హోల్కర్ అని చత్తీస్‌ఘడ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం అరుణ్ సావ్ అన్నారు. తాను రాజమండ్రి రావడం ఎంతో ఆనందం కల్గించిందని, రాజమండ్రి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన సాంస్కృతిక రాజధాని అని పేర్కొన్నారు. శనివారం అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచన మేరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అరుణ్ సావ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆనాడు అహిల్యాబాయి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలన్నీ నేడు ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందేలా అహల్యాబాయి ఆనాడే కృషి చేశారన్నారు. అందరి వికాసం, సంస్కృతి వికాసం జరగాలన్నది ప్రధాని మోదీ లక్ష్యమని, అందుకే బీజేపీ ఈ కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. పురందేశ్వరి విదేశాలకు వెళ్లి.. పాకిస్థాన్‌పై భారతదేశం ఆపరేషన్ సిందూర్ ఎందుకు చేపట్టిందనే విషయాన్ని, మన దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచదేశాలకు చాటిచెప్పే ప్రయత్నంలో ఉన్నారన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అహల్యాబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ అహల్యాబాయి.. తన భర్త ఇచ్చిన అక్కౌంటు సరిగాలేదని తిరస్కరించిన దేశమాత, ధీరోత్తమురాలు అని అన్నారు. చరిత్ర, వారసత్వ సంపదను పరిరక్షించే పార్టీ బీజేపీ అని అన్నారు. రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ అహల్యాబాయి జీవిత విశేషాలను, సాహసోపేత కార్యక్రమాలను వివరించారు. ముందుగా వై. జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, లక్ష్మీ ప్రసన్న, హారిక, స్వర్ణ రజని, తపన చౌదరి, పరిమి రాధ, రొంగల గోపి, వీరా వీరాంజనేయులు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే గోరంట్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రోత్సాహకాలను వినియోగించుకుని యువత పరిశ్రమల స్థాపన వైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో వెలుగుబంటి రామచంద్రరావు కళ్యాణ మండపంలో శనివారం పరిశ్రమల ఏర్పాటు-ఉద్యోగ అవకాశాలపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయన్నారు. సీడ్ ఏపీ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ వంటి సంస్థల సహకారంతో పరిశ్రమల ఏర్పాటులో శిక్షణ, నిధుల సమీకరణ, సాంకేతిక సహాయం వంటి అంశాల్లో పూర్తి సహకారం లభిస్తుందన్నా రు. సీడ్ జిల్లా మేనేజర్ కిరణ్, విజయనగరం సెంచూరియన్ విశ్వవిద్యాలయం డీన్ అనిల్ పరిశ్రమల ఏర్పాటుపై పవర్ ప్రజంటేషన్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, పంతం గణపతి, బోడపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

వంగలపూడి ఇసుక ర్యాంపుపై ఎన్జీటీకి ఫిర్యాదు

సీతానగరం, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగవరం ఇసుక రీచ్‌లలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై ఎన్జీటీకి మెయిల్ ద్వారా సమాచారం ఫిర్యాదు చేసినట్టు వంగలపూడికి చెందిన మాజీ సైనికుడు, న్యాయవాది సూరెడ్డి శివకుమార్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి వంగలపూడి ర్యాం పు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలను అడ్డుకుని వాటిని వీడియోలు, ఫొటోలు తీసి జిల్లా కలెక్టర్, ఏడీ మైన్స్, స్థానిక తహశీల్దార్, ఎస్‌ఐలకు సామాజిక మాధ్యమాల ద్వారా తెలియపర్చానన్నారు. శనివారం ఉదయం మైన్స్ ఏడీ నుంచి లిఖిత పూర్వక మెసేజ్ వచ్చిందని అందులో జిల్లా కలెక్టర్‌కు గాని తనకు గాని సంబంధం లేదని తెలిపారు. అనకాపల్లి కలెక్టర్ మైన్స్ డిపార్ట్‌మెంట్ మాత్రమే సంబంధం ఉందని తెలియపర్చారన్నారు.జిల్లాలో ఇసుక తవ్వకాలపై వారికి సంబంధం లేదని అనడం హాస్యాస్పదంగా ఉందని ఎన్జీటీకి తెలిపర్చిన తరువాత తనకు సమాచార అందించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సింగవరం లంక భూముల్లో తవ్వకాలు జరపాల్సి ఉండగా వంగలపూడి లంక భూముల్లో తవ్వకాలు జరిపి సింగవరం ర్యాంపు నుంచి కాకుండా వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుక లారీలపై తరలిస్తున్నారని దుయ్యబట్టారు. అనకాపల్లి కలెక్టర్, ఏడీ మైన్స్ వారు వచ్చి పూర్తి వివరాలు తెలియపర్చే వరకు లారీలను అడ్డుకుంటామని శివకుమార్ పేర్కొన్నారు.

బీజేపీ విధానాలతో దేశ సమగ్రతకు ముప్పు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ



సభలో మాట్లాడుతున్న వనజ

రాజమహేంద్రవరం అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశ ప్రాదేశిక సమగ్రతకు తీవ్రమైన ముప్పు వాటిల్లుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. శనివారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని మున్సిపల్ స్టేడియం వద్ద జట్ల సంఘం శాఖ మహాసభ అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత రాజకీయాలు అత్యంత క్లిష్టంగా ఉన్నాయని, ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతోందని, దీన్ని తిప్పికొట్టాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు దమనకాండ సాగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, జట్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

తుల్యభాగ డ్రెయిన్‌లో పూడిక తొలగించాలి



ఊలపల్లిలో చెత్తతో పూడుకుపోయిన డ్రెయిన్

బిక్కవోలు, మే 31(ఆంధ్రజ్యోతి): ఊలపల్లి గ్రామం నుంచి మురుగుకాలువ వరకూ ఉన్న తుల్యభాగ డ్రెయిన్‌లో పూడిక తీయాలని కొంకుదురు రైతులు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామంలోని 250 ఎకరాలు, ఊలపల్లి గ్రామ పరిధిలోని 200 ఎకరాల్లోని మురుగునీరు ఈ కాలువలో కలసి ఆ నీరంతా కాకినాడ సముద్రంలో కలుస్తుందన్నారు. కొంకుదురు రైతులందరం ఎకరానికి రూ.1 వెయ్యి చొప్పున వేసుకుని ఈ కాలువలో పూడిక తీయించామని, అయితే ఊలపల్లి గ్రామం మొదలుకుని మురుగుకాలువ వరకూ చెత్త, చెదారంతో కాలువ నిండిపోయిందని, అధికారులు స్పందించి వెంటనే కాలువ పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వర్షాలు వస్తే ఈ కాలువ ద్వారా నీరు వెనుకకు వచ్చి తమ పొలాలు ముంపుకు గురయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జాయింట్ సెక్రటరీగా రాజా

గోకవరం, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జాయింట్ సెక్రటరీగా గోకవరం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అక్షింతల రాజా నియమితులయ్యారు. గోకవరంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో శనివారం జరిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఈ విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం తెలియజేశారు. అనంతరం రాజాను పలువురు అభినందించారు. ఇదిలా ఉండగా జగ్గంపేటలో ఈ నెల 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు పాల్గొనాలని ఆయన అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో చేస్తున్న అరాచకాలు, సూపర్ సిక్స్ పథకాల విఫలంపై ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అనంతరం వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాసరి చిన్నబాబు, గుల్లా ఏడుకొండలు, సుంకర రమణ, సమ్మిటి మోహన్, అక్షింతల రాజా, బదిరెడ్డి అప్పన్నదొర, జాజుల ప్రసాద్ పాల్గొన్నారు.



రాజాను అభినందిస్తున్న తోట నరసింహం, తదితరులు

పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆవిష్కరించారు. స్థానిక వైసీపీ మండల కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మేడపాటి షర్మిళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బమ్మ.. నేటి యువతకు మార్గదర్శి



దువ్వూరు సుబ్బమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మే31(ఆంధ్రజ్యోతి): బాల వితంతువుగా ఏమాత్రం జీవితంలో కృంగిపోకుండా, స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాటంచేసి, దేశ బాంధవిగా గుర్తింపు పొందిన వ్యక్తి దువ్వూరు సుబ్బమ్మ అని, ఆమె నేటి యువతకు ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద స్వాతంత్ర్య సమర యోధుల పార్కులో శనివారం జరిగిన దువ్వూరు సుబ్బమ్మ 61వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి సుబ్బమ్మ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాటం చేసిన సుబ్బమ్మ ఎందరో మహిళలకు మార్గదర్శకులని అన్నారు. ఆమె ఏఐసీసీ సభ్యురాలిగా కూడా వ్యవహరించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డిని యువజన సమితి సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో దేశిరెడ్డి బలరామనాయుడు, మాదిరా జు శ్రీనివాస్, దుర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా, మార్టిన్ లూథర్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి విరాళం

దేవరపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): పల్లంట్లలో రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ నిర్వహణకు గ్రామానికి చెందిన కొయ్యలమూడి హనుమంతరావు భార్య మంగాదేవి రూ.10 లక్షల విరాళం, రెండు కిలోల వెండిని శనివారం అందజేశారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

రాజమహేంద్రవరం తరలిన బీజేపీ నాయకులు

సీతానగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరాలో శనివారం జరిగిన అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతికి మండలంలోని బీజేపీ నాయకులు వెళ్లారు. మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, పాలడుగుల శ్రీవిద్య ఆధ్వర్యంలో రెండు బస్సుల్లో జనాలను తరలించారు.

యోగా సాధన అలవాటుగా మారాలి

యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు



యోగా సాధన చేస్తున్న జేసీ చిన్నరాముడు, తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధన ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.చిన్నరాముడు అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ హోమియో వైద్యకళాశాల ఆవరణలో ఆరవ రోజు యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యోగా సాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమం ద్వారా యోగా సాధనపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో యోగా సాధనలో భాగంగా గోదావరి గట్టు సరస్వతి ఘాట్ వద్ద ఆదివారం ఉదయం యోగా సాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి లక్ష్యాలను సాధించే దిశగా అన్ని వర్గాల ప్రజలు యోగా సాధన కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని జేసీ కోరారు. కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.రమేష్, యోగాంధ్ర జిల్లా సమన్వయ కర్త కాజియా పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట పీహెచ్‌సీలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో యోగా కార్య క్రమంలో ఎంపీడీవో సాయిబాబు పాల్గొని మాట్లాడారు. యోగా మనిషిలో ఆరోగ్యాన్ని, మనశ్శాంతిని, ఏకాగ్రతను పెంపొందించే ప్రాచీన భారతీయ విద్యా పద్ధతి అని అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో, ఒత్తిళ్లను ఎదుర్కోవడానికి యోగా ఒక విశ్వసనీయ సాధనమని, రోజూ కొద్దిసేపు యువత, మహిళలు, పెద్దలందరూ యోగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో ట్రైనర్ శ్రీనివాసరాజు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కోసు అనసూయ, పీహెచ్‌సీ వైద్యులు కె.చిన్నారావు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండల ప్రత్యేక అధికారి, తహశీల్దార్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వీఆర్వోలకు, పంచాయతీ కార్యదర్శులకు యోగాంధ్ర కార్యక్రమంపై దిశనిర్దేశం చేశారు. ప్రతిగ్రామంలో ఆదివారం నుంచి పంచాయతీల్లోని ఐదు ప్రాంతాల్లో యోగా సెంటర్లు ఏర్పాటు చేసి ప్రతిరోజు యోగా ట్రైనర్లతో ఆసనాలు అభ్యసన చేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రంగంపేటలో యోగా చేస్తున్న అధికారులు

పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్

- సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ సునీల్
- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం
- పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు



సీతానగరంలో నో టుబాకో డే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకును సిగరెట్, బీడి, చుట్ట, గుట్కా, పాన్ పరాగ్ వంటి ఏ రూపంలో వినియోగించినా భయంకరమైన నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఇంకా అనేక రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదముందని డాక్టర్ సునీల్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని శనివారం పలుచోట్ల నిర్వహించారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్లు ఏవీకె చైతన్య, సునీల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది పొగాకు వ్యతిరేక ప్లకార్డులు ధరించి పొగాకు రహిత సమాజం మన అందరి బాధ్యత అంటూ నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వై.సుబ్బారాయుడు, హెల్త్ సూపర్‌వైజరు కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: నో టుబాకో డే సందర్భంగా స్థానిక దానవాయిపేట బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నందం గనిరాజు సెంటర్‌లో డ్రగ్ డీఎడిక్షన్ ప్రదర్శన, ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పొగాకు వాడడం వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఈగల్ సీఐ వీవీ సూర్యమోహనరావు, ఎస్ఐ బి.నరేష్‌కుమార్, బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి టీకే హేమ, టీకే కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరం పీహెచ్‌సీ, జీఎస్ఎల్ బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా నో టుబాకో డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్లకార్డులతో రాజానగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. పొగాకు వ్యక్తిగత ఆరోగ్యానికి నష్టం చేయడమే కాకుండా జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గట్టి రామభాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌వీవీ రమణ, వైద్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ పీవో మాలిని, ప్రిన్సిపాల్ గీతా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేటలో ఆరోగ్యాన్ని ఎంచుకోండి- పొగాకును కాదు, పొగాకు మానండి - ప్రాణాలను కాపాడండి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ పొగాకు వాడకం అనారోగ్యానికి కారణమని, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు కె.చిన్నారావు, ఎంపీహెచ్ఈవో పి.ప్రసాద్, మేరీ హీలిన, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



రాజానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, జీఎస్ఎల్ విద్యార్థులు

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

కోటిలింగాలపేటలో పర్యటించిన ఎమ్మెల్యే వాసు



కోటిలింగాలపేటలో వేసే పైప్‌లైన్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని కోటిలింగాల పేటలో వర్షం ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోటిలింగాలపేటలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ ఫండ్స్ రూ.1.20 కోట్లతో పైపులైన్ వేసి కొత్త పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. గతంలో వైసీపీ ప్రజాప్రతినిధి ఇలా చేయకుండా పేపరుమిల్లు వారితో మంతనాలు జరిపి వారి నుంచి బ్యాగులు తీసుకున్నారే తప్ప కోటిలింగాలపేట ప్రజలకు ముంపు సమస్య తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.1.20 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం వద్ద, టింబర్ యార్డు వద్ద, మేజరు డ్రైనుకు పైపులైన్ కలిపి వర్షం నీరు త్వరగా వెళ్లిపోయేలా చేస్తున్నామన్నారు. అదనంగా ఇంకో పంపింగ్ స్టేషన్ పెట్టడం వల్ల వర్షం నీరుతో పాటు చుట్టుపక్కల నుంచి డ్రైన్ వాటర్ ఇక్కడకు వచ్చినప్పుడు నీరు త్వరగా వెళ్లిపోయేలా చేస్తున్నామన్నారు. అలాదే నగరంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లను పునరుద్ధరించాలి

జిల్లా ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ రాజమహేంద్రవరంలో భారీ నిరసన



మెయిన్ రోడ్డులో నిరసన ప్రదర్శన చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రద్దు చేసిన ఎండీయూ ఆపరేటర్లను పునరుద్ధరించాలని జిల్లా ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ డిమాండ్ చేసింది. శనివారం రాజమహేంద్రవరంలో ఎండీయూ యూనియన్ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆరే చిన్ని ఆధ్వర్యంలో ప్రదర్శన చేసి కోటిపల్లి బస్టాండ్ వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి వినతి అందించారు. అనంతరం మెయిన్ రోడ్డు గుండా కోటగుమ్మం సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేసి వైఎస్ఆర్ విగ్రహానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ఎండీయూ యూనిట్లను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రద్దు జీవో వల్ల రాష్ట్రంలో 9260 వాహనాలు, 18500 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఎండీయూ ఆపరేటర్లకు ఇంకా 18 నెలలు గడువు ఉన్నప్పటికీ వారిని తొలగిస్తూ జీవో విడుదల చేయడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో 9060 మంది వాహనాలు డ్రైవర్లు వుంటే వీరిలో మహిళలు 26 జిల్లాల్లో అధికంగా ఉన్నారని చెప్పారు. డీలర్లు ఇచ్చే ప్యాకేజీకి తలొగ్గిన ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల పొట్టకొట్టారని ఆరోపించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం నాయకులు సిద్ధాంతపు రవికుమార్, తానేటి రామకృష్ణ, గుటం సుశాంత్‌సింగ్, మంగళగిరి దాని జయకుమార్, గారా త్రినాద్, రామ్మూర్తి, కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, తాళ్లపూడి, గోపాలపురం, కడియం, రాజానగరం ఆపరేటర్లు పాల్గొన్నారు. కాగా కోటగుమ్మం నుంచి జరిగిన ర్యాలీలో మాజీ ఎంపీ భరత్ కూడా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థ సక్రమంగా పనిచేస్తున్నప్పటికీ, ఎందుకు తొలగించాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ర్యాలీలో వైసీపీ నాయకులు మేడపాటి షర్మిలారెడ్డి, గుత్తుల మురళీధర్, మజ్జి అప్పారావు, వాసంశెట్టి గంగాధరరావు, మార్తి లక్ష్మి, కాటం రజనీకాంత్, భవాని ప్రియ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ సుధాకరరెడ్డి
- పలుచోట్ల పింఛన్ల పంపిణీ



రాజమహేంద్రవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న యర్రా వేణు

అనపర్తి, మే 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు వంటివని గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. అనపర్తి మండలంలో సాయంత్రానికి 95శాతం పంపిణీ పూర్తి చేశామని, మిగిలిన వారికి సోమవారం అందజేస్తామని ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలోని 24వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు పర్యటించి 340 మంది లబ్ధిదారులకు స్థానిక కూటమి నాయకులు, సచివాయల సిబ్బందితో కలిసి పంచన్లు బట్వాడా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలకు కట్టుబడి ఉందన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనకు శ్రీకారం చుట్టిందన్నారు. అలాగే 50వ డివిజన్‌లో లబ్ధిదారులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. జూన్ 1వ తేది ఆదివారం కావడంతో తమ ప్రభుత్వం ఒక రోజు ముందే లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిందన్నారు.

జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాలకు స్టేట్ ర్యాంకులు





రాజానగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలోని ఫిజియోథెరపీ ఫస్టియర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు స్టేట్ ర్యాంకులు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు శనివారం తెలిపారు. వై.లిఖిత యూనివర్శిటీలోని అన్ని ఫిజియోథెరపీ కళాశాలల్లో ఫస్ట్ ర్యాంకు సాధించగా, ఎండీ వీజే బేగంకు 7వ ర్యాంకు లభించిందన్నారు. క్రమశిక్షణ, కృషి పట్టుదల కారణంగా విద్యార్థుల శ్రమ ఫలించిందని ఆయన అన్నారు.

ఘనంగా అన్న సమారాధన



రాజానగరంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

రాజానగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రాజానగరం హైస్కూల్ జంక్షన్ వద్ద శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 22వ వార్షిక వేడుకలు శనివారం ముగిశాయి. హనుమద్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. చివరి రోజు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఉల్లి బాబూరావు, కొణతం నర్సింహారావు, ఈశ్వరరావు, బిక్కిన కామరాజు చౌదరి, కుర్రే శ్రీను పాల్గొన్నారు.

దామెర్లలో ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజమహేంద్రవరం కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద నున్న దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో మనం ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిత్రలేఖనం, చేతిరాత వేసవి శిక్షణా తరగతులు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మనం అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి ఇజ్జిన వినోద్‌కుమార్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో నెల రోజుల పాటు విద్యార్థులకు చిత్రకళ, చేతిరాత, కోలాటం, వెస్ట్రన్ డ్యాన్స్, శాస్త్రీయ నృత్యం, మట్టిబొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చామన్నారు. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించామని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జక్కంపూడి విజయలక్ష్మి.. దామెర్ల రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీవీఎస్ కృష్ణారావు, జేవీ సూర్యప్రకాష్, జె.సుధ, కేర్‌టేకర్ ఎం.ఆదిలక్ష్మి, పి.వీరభద్రరావు, డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

శివాలయంలో హుండీ పగులగొట్టి రూ.40 వేలు అపహరణ

రాజమహేంద్రవరం సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దేవిచౌక్‌లోని శివాలయంలో దొంగలు పడి ఆలయ హుండీ పగులగొట్టి సుమారు రూ.40 వేలు నగదును అపహరించుకుపోయారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. దేవిచౌక్ సెంటర్‌లోని శివాలయంలో శుక్రవారం రాత్రి తాళాలు వేసుకుని పూజారి ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున 4గంటలకు పూజారి ఆలయానికి రాగా తలుపులు తాళాలు పగులగొట్టి ఉంది. ఆలయంలో ఉన్న హుండీ తాళాలు కూడా పగులగొట్టి వుంది. లోపల స్వామివారికి భక్తులు వేసిన కానుకలు కనిపించలేదు. దీంతో దొంగలు పడి అపహరించుకుపోయారని ఆలయ ధర్మకర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ



దాణా పంపిణీ చేస్తున్న నాయకులు

అనపర్తి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు 11 టన్నుల పశువుల దాణా సబ్సిడీపై పంపిణీ చేసినట్టు పశు వైద్యాధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పొలమూరులో రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై దాణా అందజేస్తోందని, 50 కిలోల బస్తా రూ.1110 ఉండగా రైతు 50శాతం సబ్సిడీ పోను రూ.555 చెల్లిస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, ద్వారంపూడి ఈశ్వరరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

ఆదివారం 1 జూన్ 2025 | 5



మా బాబే.. మాతో నడుస్తున్నా : చెయ్యేరులో ఉపాధి హామీ మహిళా శ్రామికులతో కలిసి చెరువును పరిశీలించి వస్తున్న సీఎం చంద్రబాబు



పెన్షన్..నో టెన్షన్ : ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడి అక్కడే పింఛను అందజేస్తున్న సీఎం చంద్రబాబు



మీ సేవకు హ్యాట్సాప్ : బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న మంతెన రామరాజును సన్మానిస్తున్న సీఎం



మీ మనసు బంగారం : బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న త్సవటపల్లి నాగేంద్రరావుకు సన్మానం




మీ వెంటే నడుస్తాం : చెయ్యేరులో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ సానా సతీష్, మహాసేన రాజేష్ తదితర టీడీపీ నాయకులు

మీరు చెప్పినట్టే అధిష్ఠానం నడుస్తుంది..

నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు దిశానిర్దేశం

ముమ్మిడివరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కార్యకర్తలే ముఖ్యం. మీ అభిప్రాయాల మేరకే పార్టీ అధిష్ఠానం నడుచుకుంటుంది. అనునిత్యం ప్రజలతో మమేకమై ఓటుబ్యాంకు పెంచే దిశగా పనిచేయాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ముమ్మిడివరం మండలం సీహెచ్.గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జరిగిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రోజు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలు పెట్టాం. రాబోయే ఎన్నికల్లో గతంలో ఓడిన 11 అసెంబ్లీ స్థానాలు మనమే గెలవాలి. టెక్నాలజీని పెంచుకుని సేవలు విసరిస్తున్నాం. ప్రజలతో కార్యకర్తలు మమేకమై మరింత పేరు తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గం టీడీపీ కంచుకోట. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో మహిళల ప్రాధాన్యత పెంచాల్సి ఉందన్నారు. 25 మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ల నియామకానికి సంబంధించి సర్వే నిర్వహించగా కొంతమందికి 90 శాతం, కొంతమందికి 50 శాతం రిపోర్టు వచ్చిందన్నారు. ఎస్సీ ఓటు బ్యాంకు పెంచేందుకు పీ4 అమలు చేస్తున్నాం అంటూ చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పనితీరుపై చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా పోస్టింగుల్లో వెనుకబడి ఉన్నారంటూ చురక వేశారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ముమ్మిడివరం నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుల పనితీరు విశ్లేషించారు. బెస్ట్ అవార్డులు తీసుకున్న క్లస్టర్ ఇన్‌చార్జి గొలకోటి దొరబాబు, యూనిట్ ఇన్‌చార్జి దూలిపూడి వెంకటసుబ్బారావు, బూత్ ఇన్‌చార్జిల దంగేటి వీరప్రసాద్‌లను అభినందించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెయ్యేరు.. జనం మురిసేరు!



ఏంటమ్మా.. సమస్య



చెరువు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

చంద్రబాబుకు నీరాజనం

- 2 గ్రామాల్లో 6 గంటల పర్యటన
- సమస్యలు విని.. పరిష్కారం
- జూన్ 12 తర్వాత గేర్ మారుస్తా
- ఆకట్టుకున్న చంద్రబాబు ప్రసంగం

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎంతో సమస్యలు చెప్పుకున్నారు..వెంటనే పరిష్కారం చూపారు.. హామీలు ఇచ్చారు..జనం మురిసేరు..మా బాబే అంటూ జేజేలు పలికారు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల పరిధిలోని రెండు గ్రామాల్లో శనివారం ఆరు గంటలపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ప్రజావేదిక నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం పురికొల్పారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో మరో సమావేశం నిర్వహించి కేడర్‌కు నేనున్నాను అనే భరోసాను కల్పించారు. నేనున్నంత వరకు టీడీపీకి ఓటమి ఉండదంటూ కేడర్ హర్షధ్వానాల మధ్య చంద్రబాబు ప్రకటించారు. సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్‌కు శనివారం 12 గంటలకు చేరుకున్న చంద్రబాబుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాట్రేనికోన మండలం చెయ్యేరులో చెరువు పూడికతీత పనుల్లో నిమగ్నమైన ఉపాధి శ్రామికులతో చెరువుగట్టున నడుస్తూ ముచ్చటించారు. ప్రజావేదిక సభలో చలోక్తులు, చురకలు, వార్నింగ్‌లు, హెచ్చరికలు చేస్తూ చేసిన ప్రసంగం అందరినీ ఉర్రూతలూగించింది.ఈ నెల 12వ తేదీ నాటికి ఏడాది పాలన పూర్తి కావడంతో పాలనా పరంగా గేర్ మారుస్తానంటూ సంకేతాలు పంపారు. చెయ్యేరులోని ప్రజావేదిక సభకు చేరుకుని రెండు బంగారు కుటుంబాలను దాతలకు దత్తత ఇచ్చారు. అదే వేదికపై సుమారు గంటా 45 నిమిషాల పాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. ప్రజావేదికలో నివేదికలను తప్పుడు తడకలుగా ఇవ్వడంతో అధికారులను మందలించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 10వేల ఇళ్లకు సోలార్ పవర్ కల్పించకపోతే 'ఎమ్మెల్యే పవర్ కట్' అవుతుందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. అవినీతి అధికారులకు ఘాటైన హెచ్చరికలు చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తానన్నారు. ఇటీవల ఒక పాస్టర్ మరణాన్ని కొందరు స్వార్థపరులు హత్యగా విష ప్రచారం చేశారన్నారు. బంగారు కుటుంబాలకు భవిష్యత్తుకు భరోసా ఇస్తూ దాతలకు బాధ్యతలు అప్పగించారు. సాయంత్రం 5.45 గంటలకు సీహెచ్.గున్నేపల్లి నుంచి హెలికాప్టర్‌పై ఉండవల్లిలోని నివాస గృహానికి బయలుదేరి వెళ్లారు.

రూ.2 లక్షల చొప్పున పరిహారం

ఇటీవల గోదావరిలో గల్లంతై మృత్యువాత పడ్డ బాలుర కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించి వెంటనే అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అవగాహన లేకుండా సరదాల కోసం స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.





నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం

ఉపాధి శ్రామికులతో 15 నిమిషాలు..

నాయకుడంటే ఎలా ఉండాలి.. ప్రజలతో మమేకం కావాలి.. వారి సమస్యలు తెలుసుకోవాలి.. వాటి పరిష్కారానికి మార్గాలు వెతకాలి.. చెయ్యేరు గ్రామంలో ఇటువంటి ఆసక్తికరమైన సంఘటనే చోటుచేసుకుంది. ఆ గ్రామంలో రూ.9.86 లక్షలతో చేపట్టనున్న చెరువు పూడికతీత పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. నరేగా పథకం కింద అక్కడ పనిచేస్తున్న ఉపాధి హామీ మహిళా శ్రామికులతో ముచ్చటించారు. వారితో కలిసి చెరువు గట్టున తిరుగుతూ ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల పథకంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ పంపిణీలో లోటుపాట్లు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. గ్రామంలో ఉన్న టీడీపీ నాయకుల పనితీరు.. ఉపాధి కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ చెరువులో పూడికతీత పనులు ఎంతకాలం ఉంటాయని ఉపాధి కూలీలను అడగ్గా, రెండు నెలల పాటు ఉంటాయని సమాధానమిచ్చారు. సుమారు పదిహేను నిమిషాల పాటు వారితో గడిపి పథకాల అమలుపై సమాధానాలు రాబట్టి సంతృప్తిని వ్యక్తంచేశారు.



ప్రజా వేదికపై చంద్రబాబు పక్కన నిలబడి సమస్య విన్నవిస్తున్న మహిళ.. చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, సుభాష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు తదితరులు

అడిగింది లేదనకుండా.. అన్నీ ఓకే..!

చెయ్యేరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి హామీల వర్షం కురిపించారు. వృద్ధ గౌతమీ నదీపాయపై పల్లంకుర్రు- జి.మూలపాలెం మధ్య అసంపూర్తిగా ఉన్న వారధి నిర్మాణాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ముమ్మిడివరం- కాట్రేనికోన వంతెన, గోగులంక బ్రిడ్జి, కుండలేశ్వరం బ్లడ్‌బ్యాంక్ ఆధునీకరణ, చెయ్యేరులో చెరువును సీపీడబ్ల్యూ పథకంలో మంజూరు చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు కోరారు. వీటికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను చంద్రబాబు వెంటనే ఆదేశించారు. చెయ్యేరు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని కోరారు.వీటికి యాక్షన్‌ప్లాన్ తయారుచేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ కావాలని కోరడంతో మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆగస్టు నాటికి బంగారు కుటుంబాల సర్వే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



మీ వెంటే ఉంటాం సార్ : ప్రజావేదిక సభలో ఒక మహిళ అభివాదం

సీఎంతో చిన్నారులు.. చిరు కోరిక!

అమలాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : నాడు సీఎం అంటే ప్రజలకు దూరం..దూరం.. నేడు సీఎం చిన్నారులకూ దగ్గరే.. చెయ్యేరు ప్రజావేదిక వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు చిన్నారులు ముఖ్యమంత్రితో మాట్లాడడానికి ప్రయత్నించారు.. అది గమనించిన సీఎం దగ్గరకు పిలిచి ఏం కావాలమ్మా అని అడిగారు.. అంతే చిన్నారుల్లో పట్టలేని ఆనందం.. అడిగిందే తడవుగా క్రికెట్ ఆడుకోవడానికి క్రికెట్ కిట్ కావాలి సార్ అంటూ కోరారు. అడిగిందే తడవుగా వెంటనే కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను పిలిచి వెంటనే చిన్నారులకు క్రికెట్ కిట్ అందించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చెయ్యేరు గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్ ద్వారా చిన్నారులకు క్రికెట్ కిట్ అందజేశారు. కిట్ అందుకున్న చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు.



ఏం కావాలో.. చెప్పండి : గ్రామంలోని పిల్లలతో ముచ్చటించి ఫొటో దిగిన దృశ్యం

క్రికెట్ కిట్ అందజేసిన దృశ్యం





నేనున్నా.. చెప్పండి : దివ్యాంగురాలి సమస్య విని అక్కడికక్కడే పెన్షన్ మంజూరు చేయించిన సీఎం

పేదలకు అండగా ప్రభుత్వం

మంత్రి కందుల దుర్గేష్



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పింఛన్లు అందిస్తూ పేదలకు అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.పట్టణంలోని 4,8 వార్డుల్లో శనివారం మంత్రి దుర్గేష్ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేసి మాట్లాడారు. జూన్ 1వ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం అందరికి ఆదర్శంగా నిలిచిందన్నారు.గత ప్రభుత్వంలో చాలీచాలని పింఛన్లు అం దిస్తే ఈ ప్రభుత్వం అం దరికి భరోసా కలిగేలా పింఛను సొమ్ము పెంచి అందిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఖజా నా ఖాళీ చేసి వెళ్లడంతో ఆర్థిక సంక్షోభంలో ఉన్నా సీఎం చంద్రబాబు నాయుడు దేనిని లెక్కచేయకుండా పేదల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తుందన్నారు. త్వరలోనే పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం పథకంతో పాటు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేస్తామన్నారు.కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, పలువురు అధి కారులు పాల్గొన్నారు.

ఒక్క రోజు.. 93.61 శాతం

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో జిల్లాలో ఈ నెల కూడా అదే జోరు కొనసాగింది. ఉదయం 9.30 గంటలకే 75% పంపిణీ నమోదైంది.జిల్లాలో మొత్తం 2,33,924 మంది లబ్ధిదారులు ఉండగా సాయంత్రానికి 2,18,966 మందికి రూ.95,25,50,500 అందజేశారు. దీంతో 93.61 శాతంతో రాష్ట్రంలో జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. ఈసారి మొదటి మూడు స్థానాల్లో కోరుకొండ(94.92), రాజమండ్రి అర్బన్(94.63),గోపాలపురం(94.44) ఉండగా..చివరి స్థానంలో కొవ్వూరు అర్బన్ (91.72) ఉంది.ఉదయం నుంచే కూటమి నాయకులు,అధికారులు,సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. సాధారణంగా ఒకటో తేదీన పింఛను అందజేస్తారు.ఒకటో తేదీ ఆదివారం కావ డంతో ఒక రోజు ముందుగా శని వారమే పింఛను ఇవ్వడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది.

నేటి నుంచి దుకాణాల్లోనే రేషన్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రేషన్ దుకాణాల పర్వం మళ్లీ మొద లైంది. జిల్లాలో ఆదివారం నుంచి పేదలకు ఇచ్చే బియ్యం,పంచదార, కందిపప్పు వంటి సరుకుల పంపిణీ రేషన్ షాపుల్లో జరగనుంది. గత వైసీపీ పెట్టిన ఎండీయూ వాహనాల విధానం లోపభూయిష్టంగా ఉందనే కార ణంతో టీడీపీ కూటమి ప్రభు త్వం పాత విధానాన్ని మళ్లీ అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ విధానాన్ని ఆదివారం ఆయా నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. జిల్లాలో 871 చౌక ధరల డిపోలు ఉండగా 5 లక్షల 64 వేల 994 రేషన్ కార్డులు ఉన్నాయి. ఆయా డిపోల్లో బియ్యం, పంచదార అందరికీ ఇవ్వనున్నారు.ఈ సారి కందిపప్పు కొంత మందికే అందనుంది. రేషన్ దుకాణాలు ప్రతి నెల 15వ తేదీ వరకూ ప్రతి రోజూ, ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా డీలర్లు సరుకును సిద్ధం చేసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రేషన్ సక్రమంగా అందజేస్తామని జిల్లా వ్యాప్తంగా డీలర్లు తెలిపారు.



పువ్వులతో రేషన్ దుకాణం ముస్తాబు

12 నుంచి పాఠశాలల్లో యోగాంధ్ర

రాజమహేంద్రవరం సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పాఠశాలలో ఈనెల 12 నుంచి 20 తేదీ వరకు తప్పనిసరిగా యోగా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి శనివారం జేసీ, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ ఎస్.చిన్నరాముడు,ఇతర అధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాపై ప్రతి మండలంలో పోటీలు నిర్వహించాలన్నారు. మెడిటేషన్, సూర్యనమస్కారాలు, యోగాలో ఆసనాలు వివిధ కేటగిరిలుగా విభజించి పోటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఐదు సెంటర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుని ప్రజలతో యోగా చేయించాలన్నారు. జూన్ 8న సీనియర్ సిటిజన్స్‌తో జిల్లా ,డివిజన్ ,మండల కేంద్రాల్లో కార్యాచరణ రూపొందించాలన్నారు.

తుఫాన్ ప్రమాదం : కలెక్టర్

తుఫాన్ వచ్చే ప్రమాదం ఉన్నందున జిల్లా, మండల అధికారులు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. భారీ వర్షాల కారణంగా నీరు నిల్వలేకుండా డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేపట్టాలని ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చూసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి,సీపీవో జేడీఎల్ అప్పల కొండ, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ . మూర్తి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేఎన్.జ్యోతి ,డీఈవో కె వాసుదేవరావు పాల్గొన్నారు.



నిఘా పెంచండి : ఎస్పీ

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఉంచడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. నేర సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచాలన్నారు. దీర్ఘకాలంగా దర్యాప్తులు కొనసాగుతున్న కేసుల విషయంలో పలు సూచనలు చేశారు. మిస్సింగ్, పోక్సో, ఎస్సీఎస్టీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ బలోపేతం చేయాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక, నేర పూరిత స్వభావం కలిగిన వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌జి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీఎస్‌వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

ఇన్‌చార్జి డీఎస్‌వోగా రాజా రమేష్

రాజమహేంద్రవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పౌర సరఫరాల అధికారి(డీఎస్‌వో)గా రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్నారు. డీఎస్‌వో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. ఈ మేరకు శనివారం సాయంత్రం బొమ్మూరులో ఒక రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు.

బాల కార్మికుల గుర్తింపునకు నెలాఖరు వరకూ ప్రత్యేక డ్రైవ్

రాజమహేంద్రవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికుల గుర్తింపునకు జూన్ 30వ తేదీ వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని డీఆర్‌వో టి.సీతారామ మూర్తి పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాల కార్మికుల కేసులు ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 17 నమోదు చేసి రూ.96118 పరిహారంగా ఇప్పించామన్నారు. వివిధ శాఖల సమన్వయంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ పని చేస్తోందని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ● పట్టణంలో అవగాహన ర్యాలీ



యోగాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో రాణీసుస్మిత, ఉద్యోగులు

కొవ్వూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి జూనియర్ కాలేజ్ సెంటర్ మీదుగా విజయవిహార్ సెంటర్ వరకు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే, ఆర్డీవో రాణీసుస్మిత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం విజయవిహార్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు యోగాసానాలు వేసి అందరినీ అలరించారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ రానున్నారు. ప్రతిఒక్కరూ ఇంటిలో ఉండే యోగా చేసుకోవచ్చునన్నారు. ఈనెల 14వ తేదీన యోగాపై మహిళలతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దీనికి హాజరయ్యే మహిళలందరూ పింక్ కలర్ దుస్తులు ధరించి రావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీఎమ్మెల్యే టీవీ రామారావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, మున్సిపల్ కమిషనర్ టీ.నాగేంద్రకుమార్. తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, ఆయుష్ డాక్టర్ కె. శ్రీవిద్య, ఎం. రామచంద్రరావు, కంటమణి ప్రసాద్, మున్సిపల్ ఆర్ఐ శ్యామ్, టీపీవో టి. మణిరామ్, ఏఈ సుమంత్, వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లు... టీడీపీకి బ్రాండ్ అంబాసిడర్

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


పట్టణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లు టీడీపీకి బ్రాండ్ అంబాసిడర్ అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావుతో కలిసి ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 1వ తేదీ ఆది వారం కావడంతో పింఛనుదారులు ఇబ్బంది పడకూడదని భావించి కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసిందన్నారు. పట్టణంలో 3,878 మంది పింఛనుదారులకు గాను ఇప్పటి వరకు 88.72 శాతం మందికి పంపిణీ పూర్తి చేసినట్టు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అలాగే మండలంలోని 16 గ్రామాలలో 9,957 మందికి గాను ఇప్పటివరకు 92.23 శాతం మందికి పంపిణీ పూర్తిచేసినట్టు ఎంపీడీవో టీటీవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మె ల్యే టీవీ రామారావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



దేవరపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి సుప్రభాతసేవ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి పలు గ్రామాలు భక్తులు పాదయాత్రగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ అందజేసింది. అలాగే బాలదుర్గమ్మ ఆలయం వద్ద ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, పటికబెల్లంతో తులాభారం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టిదుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో బాలదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

శరవేగంగా ఆర్వోబీ నిర్మాణ పనులు : మంత్రి


నిడదవోలులో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న ఆర్వోబీ నిర్మాణ పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం ఆ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనుకున్న దానికన్నా ముందుగానే వర్షాలు రావడంతో పనులు జరుగుతున్న ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, అయితే వాటిని తక్షణమే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అలాగే ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, ఆర్‌అండ్‌బీ అధికారులు, తదిరులు ఉన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజలు నిర్వహించిన జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు


స్వామివారిని దర్శించుకుంటున్న బాపిరాజు

నల్లజర్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల కోనేరు కాలనీలో వేంచేసి ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం స్వామివారికి పూర్ణాహుతి, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర పూజలు చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు పూజాధికాలు నిర్వహించారు. అనంతరం 1200 మందికి అన్నసమారాధన నిర్వ హించారు. తర్వాత పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకట రమణ, ఆలపాటి రామకృష్ణ, చింతా చైతన్య, వెల్లంకి రాఘవ, నవలం రామకృష్ణ, పేరంశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణ జయంతి

ఉండ్రాజవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్వర్గీయ సూపర్‌స్టార్ కృష్ణ 82వ జయంతిని ఆయన అభిమానులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండల పీఎంపీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, కృష్ణ అభిమాని ఎస్‌ఎం జిన్నా ఇంటి వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో అభిమానులు కోమటి శ్రీరామకృష్ణుడు, కడలి నరసింహమూర్తి, బసవరెడ్డి కృష్ణ, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్ - 3 కార్యదర్శిగా షేక్ కబీర్

గోపాలపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): వెంకటాయపాలెం గ్రేడ్-3 సచివాలయ కార్యదర్శిగా షేక్‌కబీర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు గోపాలపురం సచివాలయం-1 జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఈయన సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉండ్రాజవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ ఆర్. ఉషాదేవి పాల్గొని మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులతో తయారైన వస్తువులు సేవించడం వల్ల అనారోగ్యం పాలవుతారని చెప్పారు. పొగాకుతో తయారు చేసిన ఖైనీ, గుట్కా, జర్దా, సిగరెట్, చుట్టా, బీడీ వంటి సేవించరాదన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్‌ఎన్ కేడీవీ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం


పల్లంట్లలో ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న దాత

దేవరపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): పల్లంట్లలో కొలువై ఉన్న రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ నిర్వహణకు ఆ గ్రామానికి చెందిన కొయ్యలమూడి హనుమంతరావు భార్య మంగాదేవి రూ.10 లక్షల విరాళం, రెండు కేజీల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు ఈడ్పుగంటి శివరామ్ ప్రసాద్, బలుసు సత్యనారాయణ, కొయ్యల మూడి సురేంద్రనాథ్, మొక్కపాటి శ్రీనివాసరావు దాతలకు ధన్యవాదాలు తెలిపారు. నగదును ఆలయం పేరున డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో ధూపదీప నైవేద్యాలకు వినియోగి స్తామని చెప్పారు. దాతలు ఇచ్చిన రెండు కేజీల వెండిని అమ్మవారికి వెండి మకరతోర ణానికి వినియోగిస్తామన్నారు. ఈ విరాళాల్ని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొయ్యల మూడి చినబాబు, మాజీ జడ్పీటీసీ కొయ్యల మూడి సుధారాణికు అందజేశారు.

చదువుతో పాటు ఆట, పాటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న అవంతి సంస్థల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్

కొవ్వూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో పాల్గొంటే శారీరకంగాను, మానసికంగాను ధృడంగా ఉంటారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 30 రోజులుగా ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో అల్లూరి వెంకటేశ్వరరావు వాలీబాల్ గ్రౌండ్స్‌లో అవంతి ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న వేసవి వాలీబాల్ శిక్షణ తరగతుల ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఇందులో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పరిమి హరిచరణ్, సూరపనేని చిన్ని పాల్గొన్నారు. అవంతి సంస్థల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్, ఎమ్మెల్యే ముప్పి డి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది బాలురు, 20 మంది బాలికలు శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా బాలబాలికలకు ఎమ్మెల్యే ముప్పిడి, అవంతి చైర్మన్ ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు, ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్న ఆరుగురికి షూస్ అందజేశారు. అనంతరం ఇంటర్నేషనల్ లెవిల్ - 2 కోచ్ ఎంసీహెచ్‌ఆర్ కృష్ణంరాజు, రిటైర్డ్ పీడీ ముదునూరి నరసింహరాజును సత్కరించారు. ఇంద్రకుమార్ మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులలో 70 మందికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. గతపది సంవత్సరాలుగా అసోసియేషన్ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. అసోసియేషన్‌కు తమ సంస్థ ద్వారా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్, కార్యదర్శి సూరపనేని చిన్ని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గారపాటి రాఘవేంద్రరావు, కోశాధికారి కొయ్యల ప్రసాద్, బీజేపీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, క్రికెట్ అసోసియేషన్ మెంబర్ బాలదారి హరిమోహన్, కోచ్‌లు ఏ. విజయకుమార్, ఆర్. సురేష్, కె. రామ్‌కుమార్, కె. గంగాధర్, ఆర్. మణికంట, పి. అచ్చియ్య, సీనియర్ క్రీడాకారులు ఎస్. హమీరుద్దీన్, నాళం సత్యనారాయణ, కంటిపూడి మోహన శ్రీరంగా, పాలెంపాటి రంజిత్, ఎస్.జనార్దనరావు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

● కోటిలింగాలపేటలో పర్యటించిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని కోటిలింగాలపేటలో వర్షం ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కోటిలింగాలపేటలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సీఎస్‌ఆర్ ఫండ్స్ రూ.1.20 కోట్లతో పైప్‌లైన్ వేసి కొత్త పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ముం పు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. గతంలో వైసీపీ ప్ర జాప్రతినిధి ఇలా చేయకుండా పేపరుమిల్లు వారితో మంతనాలు జరిపి వారి నుంచి బ్యాగులు తీసుకున్నారే తప్ప కోటిలింగాలపేట ప్రజలకు ముంపు సమస్య తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.120 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం వద్ద, టింబర్ యార్డు వద్ద, మేజరు డ్రైనుకు పైప్‌లైన్ కలిపి వర్షం నీరు త్వరగా వెళ్లిపోయేలా చేస్తున్నామన్నారు. అద నంగా ఇంకో పంపింగ్ స్టేషన్ పెట్టడం వల్ల వర్షం నీరుతో పాటు చుట్టుపక్కల నుంచి డ్రైన్ వాటర్ ఇక్కడకు వచ్చినప్పుడు నీరు త్వ రగా వెళ్లిపోయేలా చేస్తున్నామన్నారు. అలాదే నగరంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో హుండీ పగులగొట్టి రూ.40 వేలు అపహరణ

రాజమహేంద్రవరం సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): దేవీచౌక్‌లోని శివాలయంలో దొంగలు పడి ఆలయ హుండీ పగులగొట్టి సుమారు రూ.40 వేల నగదును అపహరించుకుపోయారని త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. సెంటర్‌లోని శివాలయంలో శుక్రవారం రాత్రి తాళాలు వేసుకుని పూజారి ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు తిరిగి పూజారి ఆలయానికి రాగా తలుపుల తాళాలు, హుండీ తాళాలు పగులకొట్టి వున్నాయి. లోపల స్వామివారికి భక్తులు వేసిన కానుకలూ కనిపించలేదు. దీంతో దొంగలు పడ్డారని ఆలయ ధర్మకర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అన్న సమారాధన

రాజానగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రాజానగరం హైస్కూల్ జంక్షన్ వద్ద శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 22వ వార్షిక వేడుకలు శనివారం ముగిశాయి. హనుమద్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. చివరి రోజు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఎండీయూ ఆపరేటర్లను పునరుద్ధరించాలి

● రాజమహేంద్రవరంలో భారీ నిరసన ప్రదర్శన


మెయిన్ రోడ్డులో నిరసన చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

రాజమహేంద్రవరం సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం రద్దుచేసిన ఎండీయూ ఆపరేటర్లను తిరిగి పునరుద్ధరించాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. శనివారం రాజమహేంద్రవరంలో ఎండీయూ యూనియన్ ఆధ్వర్యంలో భారీ నిరసన చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆరే చిన్ని ఆధ్వర్యంలో ప్రదర్శన చేసి కోటిపల్లి బస్టాండ్ వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం మెయిన్ రోడ్డుగుండా కోటగుమ్మం సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. చిన్ని మాట్లాడుతూ ఎండీయూ యూనిట్లు రద్దుచేస్తున్నట్టు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రద్దు జీవో వల్ల రాష్ట్రంలో 9,260 వాహనాలు, 18,500 కుంబుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఇంకా వీరికి 18 నెలలు గడువు ఉన్నప్పటికీ తొలగిస్తూ జీవో విడుదల చేయడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9,060 మంది డ్రైవర్లు వుంటే, అందులో మహిళలు 26 జిల్లాల్లో అధికంగా ఉన్నారని చెప్పారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం నాయకులు సిద్ధాంతపు రవికుమార్, తానేటి రామకృష్ణ, గుటం సుశాంత్‌సింగ్, మంగళగిరి దాని జయకుమార్, గారా త్రినాథ్, రామ్మూర్తి, కోరుకొండ, గోకవరం, కొవ్వూరు. తాళ్లపూడి గోపాలపురం, కడియం, రాజానగరం ప్రాంతాల ఆపరేటర్లు , తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ చెత్తకుప్పలే... / పట్టించుకోని అధికారులు


దేవరపల్లిలో సినిమాహాలు ఎదురుగా ఉన్న చెత్త కుప్పలు

దేవరపల్లి, మే 31 (ఆంధ్ర జ్యోతి): దేవరపల్లి పంచాయతీ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా తయా రైంది. ప్రధాన కూడలి, సినిమాహాల్ ఎదురుగా ఉన్న రహదారి పక్కన ఈ చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అలాగే పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ మార్గం గుండా సినిమా హాలుకు వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అలాగే దేవరపల్లి మెయిన్‌రోడ్డు నుంచి హైస్కూల్ వరకు వెళ్లే సిమెంట్ రోడ్డుపై డ్రైనేజీ నిర్మించకపోవడంతో ఇళ్లల్లో వాడుకనీరు రోడ్డుపైకి వచ్చి చేరటంతో నిత్యం పాదచారులు ఆ మురుగులోనే వెళ్తున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


హైస్కూల్‌కి వెళ్లే రహదారిపై నిలిచిపోయిన మురుగు

కొవ్వూరు పట్టణంలో బంగారం, నగదు అపహరణ

కొవ్వూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బంగారం, నగదు అపహరించుకుపోయారు. పోలీసులు అందించిన వివరాలివి... పట్టణంలోని దగ్గువారి వీధిలో నాగరాజు వెంకటరమణ అనే వృద్ధురాలు నివాసముంటోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం 4-30 గంటలకు నిద్ర లేచి చూసేసరికి ఇంట్లోని బీరువా, అల్మారాలోని సామగ్రి పడవేసి ఉండడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు ఆరు కాసుల బంగారు ఆభరణాలు, రూ. 18 వేల నగదు దొంగిలించుకుపోయినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదుచేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

గోపాలపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ జిరాయితీ భూమి, రైతుల మధ్య సమస్యాత్మకంగా ఉన్న భూమిలో అక్రమంగా పుల్ల నరుకుతున్న వారిపై కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు అటవీ శాఖ డీఆర్‌వో వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల మేరకు కరిచర్లగూడెం గ్రామ సమీపంలో ఉన్న మాతంగమ్మ మెట్టపై అటవీభూమికి సంబందించిన పొలంలో ఉన్న సుమారు 30 జీడి మామిడి చెట్లు కోమటికుంట, గుడ్డిగూడెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా నరుకుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆ మేరకు నరికిన చెట్లను పరిశీలించి రెండు ట్రాక్టర్లపై లోడు చేసి ఉన్న 12 టన్నుల పుల్లను సీజ్ చేశామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

బీజేపీ విధానాలతో దేశ సమగ్రతకు ముప్పు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

రాజమహేంద్రవరం అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశ ప్రాదేశిక సమగ్రతకు తీవ్రమైన ముప్పు వాటిల్లుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. శనివారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని మున్సిపల్ స్టేడియం వద్ద జట్ల సంఘం శాఖ మహాసభ అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత రాజకీయాలు అత్యంత క్లిష్టంగా ఉన్నాయని, ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతోందని, దీన్ని తిప్పికొట్టాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు దమనకాండ సాగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, జట్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.